క్లుప్తంగా

పాకాల తుంగబంధం కట్టుకాల్వకు గండి



ఖానాపురం : మండలంలోని పాకాల ఆయకట్టు పరిధిలోని తుంగబంధం జీరో కట్టుకాల్వకు గండి పడింది. ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు జీరో కట్టుకాల్వ వద్ద గండి పడి పంట పొలాల్లోకి నీరు వృథాగా పోతోంది. వర్షాలు తగ్గినా గండిని పూడ్చడంలో ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు స్పందించి గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

సన్మానం



చెన్నారావుపేట : ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న మండల కేంద్రానికి చెందిన జాగృతి హైస్కూల్ కరస్పాండెంట్ ఈగ సత్యనారాయణను స్కూల్ ఆవరణలో రాష్ట్ర, జిల్లా వినియోగదారుల ఫోరం, స్వచ్ఛంద సంస్థల సమైక్య సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి జ్ఞాపిక అందించి అభినందించారు. కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రతన్‌సింగ్ ఠాకూర్, జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్, విజిలెన్స్ కమిటీ సభ్యులు నాగిని సారంగం, వసంత, లీడ్ గ్రంథాలయ సంస్థ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీల సంఘం అధ్యక్షుడికి..



రాయపర్తి : ఆర్‌ఎంపీల సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన బండ యాదగిరిని కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు ప్రథమ చికిత్స అందించడంతోపాటు ఆర్‌ఎంపీలు, పీఎంపీల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. యాదగిరిని అభినందించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఐరెడ్డి ఎల్లారెడ్డి, నాయకులు ఉల్లెంగుల నర్సయ్య, లేతాకుల యాదవరెడ్డి, పరుపాటి రాజిరెడ్డి, దురిశెట్టి రాజు, పాషా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి..



చెన్నారావుపేట : స్థానిక ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రాజేశ్‌రెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శాలువాతో సన్మానించారు. తొలుత నాయకులు ఎస్సై రాజేశ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అమ్మ రాజేశ్, పల్లకొండ తిరుపతి, మేడి రాజ్‌కుమార్, అమ్మ రవి, మరాటి రవి, అన్న రమేశ్, రాజు, వీరస్వామి, సతీశ్ పాల్గొన్నారు.

ఏఈఓగా అబిద్ హుస్సేన్ సేవలు అభినందనీయం



గీసుకొండ : ఏఈఓగా అబిద్ హుస్సేన్ మొగిలిచర్ల క్లస్టర్‌లోని ఐదు గ్రామాల రైతులకు అందించిన సేవలు అభినందనీయమని ఏఓ హరిప్రసాద్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్ అన్నారు. బదిలీ అయిన సందర్భంగా అబిద్ హుస్సేన్‌ను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏఓ హరిప్రసాద్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ రమేశ్ మాట్లాడారు. ఏఈఓగా హుస్సేన్ రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తూ ఉద్యోగానికి వన్నె తెచ్చారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మొగిలిచర్ల శాఖ మేనేజర్ సౌందర్య, సొసైటీ డైరెక్టర్లు లెంకలపెల్లి స్వామి, జనగాం శ్రీనివాస్, బిల్ల రవి, వనపర్తి కట్టస్వామి, రాజు, కల్పన, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం


పర్వతగిరి : మండల కేంద్రంలో పోలీసులు ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై బి.ప్రవీణ్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా దారం సోమయ్య అనే వ్యక్తి స్కూటీపై అనుమానాస్పదంగా వెళ్తూ కనిపించాడు. పోలీసులు అతడిని అడ్డుకుని తనిఖీ చేయగా అతడి బ్యాగులో సుమారు రూ.9 వేల విలువైన గుట్కా, తంబాకు లభించింది. సోమయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



నర్సంపేట : గణనాథుడి వద్ద టీపీసీసీ సభ్యుడు రామానంద్, తదితరులు



వర్ధన్నపేట : గణపతి పూజలు చేస్తున్న ప్రదీప్‌కుమార్‌-అనూష మిత్రబృందం



సంగెం : శాకంబరీ అలంకరణలో గణపతి



నర్సంపేట రూరల్ : సర్వాపురంలో..

వైభవంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు



నర్సంపేట : సబ్బు బిళ్లపై గణనాథుడు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, సంగెం, చెన్నారావుపేట, ఖానాపురం, గీసుకొండ, పర్వతగిరి, దుగ్గొండి, రాయపర్తి, నల్లబెల్లి, తదితర మండలాల్లో గణనాథుడికి వైభవంగా పూజలు నిర్వహించారు. పలు చోట్ల హోమం చేశారు. శివాంజనేయస్వామి ఆలయ ఆవరణలో వేపచెట్టుకు ఏర్పడిన గణపతి ఆకృతికి భక్తులు పూజలు నిర్వహించారు. కళాకారుడు, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ హోల్డర్ గోక రామస్వామి గణపతిని సబ్బు బిళ్లపై చెక్కి కళను చాటారు. గురిజాలలో డప్పు వాయిద్యాల నడుమ శోభయాత్ర నిర్వహించి నిమ్మజనం చేశారు. వర్ధన్నపేట మండలానికి చెందిన ఆత్మకూరు ప్రదీప్‌కుమార్-అనూష దంపతులు హిందూ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా దుబాయిలోని వారి నివాసంలో గణనాథుడిని పూజించగా వారి మిత్రబృందం హాజరై సందడి చేసింది. సంగెంలో విఘ్నేశ్వరా యూత్ ఏర్పాటు చేసిన గణనాథుడు 21 రకాల కూరగాయలతో శాకంబరీ అలంకరణలో దర్శనమిచ్చారు. బీకోజీనాయక్ తూర్పుతండాలో నవయువ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణపతి వద్ద లడ్డూను వేలంలో భూక్యా లలిత-రాజు దంపతులు రూ.23,116కు దక్కించుకున్నారు.



పర్వతగిరి : పూజ చేస్తున్న సీఐ, ఎస్సై



రాయపర్తి : అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై



ఖానాపురం : పూజలు చేస్తున్న ఎస్సై రఘుపతి



నల్లబెల్లి : హోమం చేస్తున్న భక్తులు



గీసుకొండ : ఎలుకుర్తిలో పూజ చేస్తున్న నిమ్స్ లైజనింగ్ ఆఫీసర్ రమేశ్



సంగెం : రూ.23,116కు లడ్డు దక్కించుకున్న దంపతులు



చెన్నారావుపేట : పాత మగ్దుంపురంలో పండ్లు పంపిణీ చేస్తున్న భిక్షపతి



దుగ్గొండి : నాచినపల్లిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాలి

వర్ధన్నపేట : కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని వర్ధన్నపేట మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోత్ అరుణ సూచించారు. వర్ధన్నపేట పట్టణంలో ఎలక్ట్రికల్ బైక్ షోరూంను ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కాలుష్య నివారణకు ఎలక్ట్రికల్ వాహనాలు ఎంతో తోడ్పడతాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలక్ట్రికల్ బైక్‌లు, కార్లు మార్కెట్‌లోకి వస్తే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఎలక్ట్రికల్ వాహనాలకు సైతం ప్రభుత్వం రాయితీలు అందించి ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగిస్తే పర్యావరణ పరిరక్షణకు దోహదపడిన వారవుతారన్నారు. కార్యక్రమంలో ఏడీఎంఎస్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ అల్లం ప్రేంరెడ్డి, కౌన్సిలర్ తోటకూరి రాజమణి, కంపెనీ ప్రతినిధులు గజ్జల రమేశ్, నేతావత్ రాజేందర్, బానోత్ వీరన్న, పోశాల శ్రీనివాస్, రాయపురం కుమార స్వామి, పూజారి రఘు పాల్గొన్నారు.



షోరూంను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ అరుణ

ఎస్‌డీఎఫ్ నిధులతో వసతుల కల్పన

గీసుకొండ : ఎస్‌డీఎఫ్ నిధులతో ప్రజలకు అవసరమైన వసతులు కల్పించేలా పనులు చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఆరెపల్లిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి కేటాయించిన రూ.1.60 లక్షల అంచనా వ్యయంతో ఆదివారం చేపట్టిన బోరు ఏర్పాటు పనులను శ్రీనివాస్ ఆధ్వర్యంలోని బృందం సందర్శించి పర్యవేక్షించింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి చొరవ తీసుకుని ఎస్‌డీఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కమలాకర్, నాయకులు శ్రీనివాస్, బాబురావు, రాజేందర్, సుమన్, రాజమల్లు, రాజు, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ రాజారాంరెడ్డి, మిషన్ భగీరథ హెల్పర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



బోరు పనులను పరిశీలిస్తున్న నాయకులు

బీసీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరేందర్




ఖానాపురం : బీసీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని అశోక్‌నగర్‌కు చెందిన నరేందర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు నరేందర్‌కు సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య నియామకపత్రాన్ని ఆదివారం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో నరేందర్ మాట్లాడారు. బీసీల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్, శ్రీనివాస్, సారయ్య, మల్లేషం, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక



అజీజ్



భిక్షపతి

దుగ్గొండి : పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని మండల కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఎం ఏ.అజీజ్, ప్రధాన కార్యదర్శిగా పోలోజు భిక్షపతి, అసోసియేట్ అధ్యక్షుడుగా వీరన్న, మహిళా ఉపాధ్యక్షురాలిగా పద్మశ్రీ, కార్యదర్శులుగా భానుమూర్తి, విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పూజారి సురేందర్ వ్యవహరించారు. కార్యక్రమంలో నాయకులు పరుపాటి సుధాకర్‌రెడ్డి, రవికిరణ్, నక్కిరెడ్డి, మార్త శ్రీనివాస్, విజయ్, రఘు, భాస్కర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హరిహర ఎస్టేట్ కార్యవర్గం..



గీసుకొండ : మండలంలోని గొర్రెకుంట గ్రామ శివారులోని హరిహర ఎస్టేట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా దేశబోయిన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గజ్జి శశిధర్ బాపూజీ, కోశాధికారిగా మణికంఠ శ్రీరాంరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా పల్నాటి శ్రీనివాస్, సలహాదారుగా అనంతుల విజయమ్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఎస్టేట్ ఓనర్ల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కార్యవర్గం పాటుపడుతుందని తెలిపారు. అనంతరం కార్యవర్గాన్ని సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

'ఫర్టిలైజర్' కమిటీ అధ్యక్షుడిగా మదన్‌మోహన్



మదన్‌మోహన్



మొహినుద్దీన్

నల్లబెల్లి : ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా మండలంలోని కన్నారావుపేటకు చెందిన కాసం మదన్‌మోహన్‌రెడ్డి ఎన్నికయ్యాడు. నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఖాజా మొహినుద్దీన్, కోశాధికారిగా మామిండ్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తన ఎన్నికకు కృషి చేసిన డీలర్లు దేవ సుధీర్, గోనె రాంబాబు, కారుకూరి శ్రీను, శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ 'పోరాట' స్ఫూర్తితో ఏకం కావాలి

వర్ధన్నపేట : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి ఆకాంక్షించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి పాలకుర్తి వరకు ఆదివారం చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు మాత్రమే పాల్గొన్నారని చెప్పారు. ఆంధ్ర మహాసభ, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన భూమిక పోషించాయని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతోన్మాదంతో వక్రీకరించేలా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కమ్యూనిస్టు పార్టీలు ఏకమైతే బూర్జువా పార్టీలన్నిటినీ ప్రజలు ఇంటిబాట పట్టిస్తారని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి నాటి పోరాట స్ఫూర్తితో ఉద్యమిస్తామని ప్రతిన బూనారు. కార్యక్రమంలో నాయకులు మంద రవి, గుగులోతు అరుణ్‌నాయక్, కనకం సంధ్య, బత్తిని కుమారస్వామి, ఉడుత గణేశ్, ఉడుత భిక్షపతి, నల్లమల్ల కిరణ్, బత్తిని ప్రశాంత్, అశోక్, రాజు, ఖాజర్ బాషా, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అధికారికంగా నిర్వహించాలి

దుగ్గొండి : సెప్టెంబర్ 17ను తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకుడు కుసుంబ బాబురావు డిమాండ్ చేశారు. మండలంలోని రేబల్లెలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. నాటి అమరుల స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి రాజా సాహెబ్, నాయకులు గటిక కోటేశ్వర్, భాస్కర్, సుధాకర్, చేరాలు, ఐలోని, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి : రేబల్లెలో..

నిబంధనలు తప్పనిసరి



నల్లబెల్లి : మండలంలో నేడు (సోమవారం) తలపెట్టిన వినాయక నిమజ్జనంలో డీజేల యజమానులు, ఉత్సవ కమిటీల నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్సై ప్రశాంత్ బాబు కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీజే యజమానులకు ఆయన కౌన్సెలింగ్ చేశారు. గణపతి విగ్రహాల ఊరేగింపులో డీజే బాక్స్‌లు పెట్టొద్దని చెప్పారు. సంప్రదాయ నృత్యాల నడుమ ఘనంగా, ప్రశాంతంగా శోభయాత్ర నిర్వహించాలని సూచించారు. నిమజ్జనం సమయంలో చెరువుల వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు పాటించాలని, రాత్రి వీలైనంత త్వరగా ముగించేలా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని ఆకాంక్షించారు.

డీజేలకు అనుమతి లేదు

దుగ్గొండి : నేటి గణపతి నిమజ్జన వేడుకల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శోభాయాత్రలో భక్తులకు ఎవరైనా ఇబ్బంది కలిగించినా, మద్యం సేవించి ఘర్షణలకు పాల్పడినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డీజే ఏర్పాటు చేస్తే కేసు నమోదు చేస్తామన్నారు. శోభాయాత్రలో వాహనాలు క్యూ, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. రాత్రి 10.30 గంటలలోపు నిమజ్జనం పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

నిమజ్జన ఏర్పాట్లలో సమన్వయం కీలకం

నెక్కొండ : గణేశుడి విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయడం కీలకమని సీఐ చంద్రమోహన్ అన్నారు. మండలంలోని పలు చెరువులను తహసీల్దార్ రాజ్‌కుమార్‌తో కలిసి సీఐ ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా, అపశ్రుతులు చోటు చేసుకోకుండా తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గణపతుల నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఆకాంక్షించారు. గణేశ్ విగ్రహాల ఊరేగింపులో నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దయాకర్, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండ చెరువును పరిశీలిస్తున్న సీఐ

బాధిత కుటుంబాలకు సేవా నిధి సాయం

వర్ధన్నపేట : భార్య లేదా భర్త చనిపోతే బాధిత కుటుంబాలకు సామాజిక సేవా నిధి నుంచి సాయం అందిస్తున్నట్టు సీసీ గోలి కొమురయ్య తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లిలో వేర్వేరు కారణాలతో చెలకలపెల్లి యాకయ్య, పసునూరి లక్ష్మీనారాయణ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు సీసీ కొమురయ్య ఆదివారం రూ.5 వేలు చొప్పున చెక్కులు అందజేసి మాట్లాడారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం ఉన్న మణికంఠ గ్రామైక్య సంఘంలో సేవా నిధి కింద ఒక్కో సభ్యురాలు ఏటా రూ.100 చెల్లిస్తారని తెలిపారు. సభ్యుల కుటుంబాల్లో భార్య లేదా భర్త చనిపోతే రూ.5 వేల సాయం అందజేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో వీఓ అధ్యక్ష, కార్యదర్శులు భవానీ, యాకలక్ష్మి, ఓబీ సభ్యులు సంధ్య, సునీత, నర్మద, పూజ, ఆగపాటి శ్వేత, రాధిక, రజిత పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు



సంగెం : అనాథ వృద్ధుడికి తండావాసులు అంత్యక్రియలు నిర్వహించిన ఘటన మండలంలో ఆదివారం చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా.. మండలంలోని ఎల్గూర్ స్టేషన్ గ్రామ శివారులోని రామచంద్రునాయక్ తండాలో గుగులోతు ఛత్రు (85) అనే వృద్ధుడు ఒంటరిగా జీవిస్తున్నాడు. గత 15 ఏళ్లుగా తండావాసులే ఆయనకు భోజనం పెడుతుంటే జీవనం సాగించాడు. అనారోగ్యం బారిన పడి ఛత్రు ఆదివారం మృతి చెందగా తండావాసులు రూ.30 వేలు చందాలు వేసుకుని అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. డీజే పెట్టి బాణాసంచా పేల్చుతూ దహన సంస్కారాలు నిర్వహించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయపర్తి : మండలంలోని కొండూరుకు చెందిన పాము యాకాంబ్రం ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు ఆదివారం పరామర్శించారు. తొలుత యాకాంబ్రం చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొమ్ము రాజు, నాయకులు నేరెల్లి మహేశ్, కొమ్ము కుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ నాయకురాలికి..

దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకురాలు తాళ్లపెల్లి సాంబలక్ష్మిని ఆమె భర్త శ్రీనివాస్ వారం రోజుల క్రితం మృతి చెందిన క్రమంలో టీజేఎస్ రాష్ట్ర నాయకుడు అంబటి శ్రీనివాస్ ఆధ్వర్యంలోని బృందం పరామర్శించింది. తొలుత శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. బాధత కుటుంబాన్ని ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బొనగాని రవీందర్, షేక్ జావిద్, పరుపాటి రఘోత్తంరెడ్డి, సాంబరాజు మల్లేశం, బందెల సదానందం, ఇంద్రసేనారెడ్డి, సోర్తి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.